


Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక




శుక్రవారం 14-08-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :2 | సంచిక :57 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

## గాంధీ పుట్టిన దేశంలో ప్రజాస్వామ్యానికి సంకెళ్లు!

- 'రెడ్ బుక్ రాజ్యాంగం'పై జగన్ ఫైర్.. ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్ట్‌పై తీవ్ర ఆరోపణలు
- రాత్రి 2.45 గంటలకు వందలాది పోలీసులు వచ్చి ఇంటి తలుపులు, సీసీ కెమెరాలు ధ్వంసం చేశారని ఆరోపణ
- టీడీపీ కార్యకర్తలే దాడికి పాల్పడి.. బాధితులనే నిందితులుగా మార్చారని విమర్శ
- చంద్రబాబు డైరెక్షన్‌లోనే కుట్రల పాలన సాగుతోందని జగన్ ఆరోపణ


2లో

## నిరూపిస్తే రాజకీయాలు వదిలేస్తా!'


2లో

కామారెడ్డి,13 ఆగస్టు (ఇది కద నిజం): తన వ్యాఖ్యల వెనుక ఎలాంటి రాజకీయ దురుద్దేశం, స్వార్థం లేదని బాన్సువాడ ఎమ్మెల్యే, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. తనకు స్వార్థం ఉందని నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ చేశారు. తన వ్యాఖ్యలపై రాజకీయ దుమారం రేగిన నేపథ్యంలో గురువారం కామారెడ్డి జిల్లా వర్ని మండలం జాకోరాలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన సందర్భంగా ఆయన వివరణ ఇచ్చారు.

## కాంగ్రెస్‌తో సంబంధం లేనివారికి ప్రభుత్వంలో కీలక పదవులు

### : కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి


2లో

హైదరాబాద్, ఆగస్టు 13(ఇది కద నిజం): కాంగ్రెస్ పార్టీతో సంబంధం లేని కొంతమంది నేడు ప్రభుత్వంలో కీలక పదవులు అనుభవిస్తుండటం బాధాకరమని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. తాను ప్రతిపక్షంలో ఉన్నా.. అధికారంలో ఉన్నా ప్రజల పక్షాన నిలబడతానని చెప్పారు. రవీంద్రభారతిలో కళాకారుడు ఏపూరి సోమన్న 25 ఏళ్ల పాటల ప్రస్థానంపై రూపొందించిన పుస్తకాన్ని రాజగోపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు.

## యూనిటీ మాల్ ఒప్పందంపై విచారణ జరపాలి

- కాంగ్రెస్, బీఆర్ఎస్ అవినీతిలో అన్నదమ్ములే.. బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు తీవ్ర ఆరోపణలు


2లో

ఢిల్లీ: తెలంగాణలో ప్రజల ఆస్తులు, ప్రభుత్వ భూముల విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు ఒకే విధానాన్ని అనుసరిస్తున్నాయని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు ఆరోపించారు. ప్రజల సొమ్మును వినియోగించుకునే విషయంలో రెండు పార్టీలు పోటీ పడుతున్నాయని విమర్శించారు. "బీఆర్ఎస్ పదేళ్ల అవినీతిని మించి కాంగ్రెస్ దోచుకోవాలని చూస్తోంది. రెండు పార్టీలు ఒకే నాణేనికి రెండు వైపులా ఉన్నాయి" అని వ్యాఖ్యానించారు. యూనిటీ మాల్ నిర్మాణానికి సంబంధించి జరిగిన ఒప్పందంపై సమగ్ర దర్యాప్తు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.202 కోట్లతో యూనిటీ మాల్ నిర్మించాలని నిర్ణయించగా.. ఇందుకోసం తెలంగాణ ప్రభుత్వం ఆరు ఎకరాలకు పైగా భూమిని కేటాయించిందని రఘునందన్‌రావు తెలిపారు. ఈ వ్యవహారంలో అవినీతి జరిగిందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలను కూడా విచారించాలని కోరారు.

## 'సీఎంవా.. రియల్ ఎస్టేట్ ఏజెంటువా?'

- ప్రభుత్వ భూముల వేలంపై రేవంత్ సర్కారును నిలదీసిన హరీశ్‌రావు..
- రాయదుర్గ్ భూముల వేలం ఆపాలని డిమాండ్

హైదరాబాద్, ఆగస్టు 13(ఇది కద నిజం): తెలంగాణలో ప్రభుత్వ భూముల విక్రయాలపై అధికార, ప్రతిపక్షాల మధ్య మరోసారి మాటల యుద్ధం మొదలైంది. ప్రభుత్వ భూములను ఎక్కడపడితే అక్కడ వేలం వేస్తూ ప్రజల ఆస్తులను అమ్మకానికి పెడుతున్నారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. "రేవంత్‌రెడ్డి.. నువ్వు ముఖ్యమంత్రివా? లేక రియల్ ఎస్టేట్ ఏజెంటువా?" అంటూ ప్రశ్నించారు. ఈ మేరకు భూముల వేలంపై సీఎంకు ఆయన బహిరంగ లేఖ రాశారు.

2లో



## తెలంగాణలో 'స్మార్ట్ రేషన్ కార్డులు' పంపిణీ: మోడల్ కార్డును విడుదల చేసిన ప్రభుత్వం



2లో

రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు డిజిటల్ సేవలను మరింత వేగవంతంగా అందించేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నెల 15 నుంచి రాబోయే 15 రోజుల పాటు కొత్త 'స్మార్ట్ రేషన్ కార్డుల'ను పంపిణీ చేయనుంది. ఈ నేపథ్యంలో కొత్త స్మార్ట్ రేషన్ కార్డు మోడల్‌ను ప్రభుత్వం అధికారికంగా విడుదల చేసింది.

## భూ కేటాయింపులపై బీఆర్ఎస్ రాజకీయం చేస్తోంది: ఎంపీ చామల


2లో


దిల్లీ, ఆగస్టు 13(ఇది కద నిజం): టెస్సరాక్ట్ సంస్థకు కేటాయించిన భూములపై బీఆర్ఎస్ రాజకీయం చేస్తోందని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. దిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ ఎంపీలతో కలిసి ఆయన మాట్లాడారు. 'ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్‌లో బీఆర్ఎస్ హయాంలో 54 కంపెనీలకు భూ కేటాయింపులు జరిగాయి. వారి హయాంలో ఎకరాకు రూ.30లక్షల నుంచి రూ.80లక్షల చొప్పున ఇచ్చారు. మా ప్రభుత్వం వచ్చాక 8 కంపెనీలకు భూ కేటాయింపులు జరిగాయి.

## 'మీ భూమి ఎక్కడికీ పోదు.. నేనే రిజిస్ట్రేషన్ చేయిస్తా'

- 22ఏ భూములపై కీలక ప్రకటన..కోర్టు కేసులు మినహా మిగతా భూములకు రిజిస్ట్రేషన్
- భూములు కొనుగోలు చేసిన వారికి సీఎం భరోసా.. 'రిజిస్ట్రేషన్ బాధ్యత నాదే'
- 22ఏ భూముల రిజిస్ట్రేషన్‌కు గ్రీన్‌సిగ్నల్.. ముందస్తు డబ్బులు తీసుకోం
- రిజిస్ట్రేషన్ చార్జీలు కూడా మినహాయింపు:సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 13(ఇది కద నిజం): 22ఏ నిబంధనల కింద ఉన్న భూముల విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. కేపీహెచ్‌బీ కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజలు కొనుగోలు చేసిన భూములకు రక్షణ ఉంటుందని, కోర్టు వివాదాల్లో ఉన్న భూములు మినహా మిగిలిన వాటిని రిజిస్ట్రేషన్ చేయించే బాధ్యత తానే తీసుకుంటానని స్పష్టం చేశారు.


"మీరు కొనుక్కున్న భూమి ఎక్కడికీ పోదు. నేనే రిజిస్ట్రేషన్ చేయిస్తా" అని సీఎం ప్రజలకు హామీ ఇచ్చారు. భూముల క్రమబద్ధీకరణ విషయంలో ప్రజలపై అదనపు భారం మోపబోమని తెలిపారు. ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన మొత్తాన్ని కూడా ఇల్లు పూర్తయిన తర్వాతే చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. భూమికి సంబంధించి ముందస్తుగా ఎలాంటి


2లో

డబ్బులు తీసుకోబోమని స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్ చార్జీలను కూడా మినహాయిస్తున్నట్లు ప్రకటించారు.

కూకట్‌పల్లికి ప్రత్యేక ప్రాధాన్యం

కూకట్‌పల్లి ప్రాంతాన్ని ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తామని రేవంత్‌రెడ్డి తెలిపారు. మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో కూకట్‌పల్లి ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రస్తావిస్తూ.. తనను ఎంపీగా పైసా ఖర్చు లేకుండా గెలిపించిన ఈ ప్రాంత ప్రజల రుణం తీర్చుకునే అవకాశం ఇప్పుడు వచ్చిందన్నారు. కూకట్‌పల్లి అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని పేర్కొన్నారు.


2లో

## 'హోర్ముజ్ మా కంట్రోల్‌లోనే ఉంది!'

- ట్రంప్ వ్యాఖ్యలకు ఇరాన్ కౌంటర్.. అమెరికా వాదనను ఖండించిన తేహ్రాన్

ఇంటర్నెట్ డెస్క్ ,13 ఆగస్టు (ఇది కద నిజం): హోర్ముజ్ జలసంధిపై అమెరికాకు పూర్తి నియంత్రణ ఉందంటూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఇరాన్ తీవ్రంగా ఖండించింది.


2లో

## కాంగ్రెస్ వాళ్లకు కర్రు కాల్చి వాత పెట్టడం ఖాయం: ఆర్ఎస్పీ

తెలంగాణ పరిపాలనలో చీకటి అధ్యాయమని.. ఒక్క రోజే 8 జీవోల అమలును నిలిపివేస్తూ హైకోర్టు ఆదేశాలు ఇచ్చిందని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. దీనికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వమే కారణమన్నారు. కళ్యాణలక్ష్మి ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు ఉపయోగ పడిందని.. రేవంత్ ప్రభుత్వం కుట్రపూరితంగా వెరిఫికేషన్ చేయాలని కళ్యాణలక్ష్మి పథకాన్ని ఆపిందని ఆరోపించారు. రోజుకు 18 గంటలు రివ్యూలు చేసే సీఎం రేవంత్‌రెడ్డికి తెలియదా అని ప్రశ్నించారు.

## 'ఇది ఆరంభం మాత్రమే.. అమరావతి నంబర్ వన్ రాజధాని!'

- వేగం పుంజుకున్న రాజధాని నిర్మాణం.. 96 కి.మీ. ఇన్నర్ రింగ్ రోడ్డు, 190 కి.మీ. ఔటర్ రింగ్ రోడ్డుకు ప్రణాళిక


2లో

అమరావతి,ఆగస్టు 13(ఇది కద నిజం): ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణం ఇప్పుడే ప్రారంభమైందని, భవిష్యత్తులో దేశంలోనే అత్యుత్తమ రాజధానిగా అమరావతి నిలుస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రాజధాని అభివృద్ధి ఇకపై ఎలాంటి ఆటంకాలు లేకుండా వేగంగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. అమరావతిని అనుసంధానించే కీలకమైన సీడ్ యాక్సెస్ రోడ్డులోని ఈ-3 మార్గాన్ని ప్రారంభించిన సందర్భంగా సీఎం మాట్లాడారు. ఉండవల్లి వద్ద సీడ్ యాక్సెస్ రోడ్డుకు అనుసంధానంగా నిర్మించిన స్టీల్ బ్రిడ్జిలకు సంబంధించిన పనులను కూడా ప్రారంభించారు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
శుక్రవారం 14-08-2026

# ‘సీఎంవా.. రియల్ ఎస్టేట్ ఏజెంటువా?’

మొదటి పేజీ తరువాయి

గతంలో ప్రభుత్వ భూములను తెలంగాణ ప్రజల జాతి సంపదగా అభివర్ణించిన రేవంత్‌రెడ్డి.. అధికారంలోకి వచ్చిన తర్వాత అదే భూములను వేలం వేయడం ఏంటని హరీశ్‌రావు ప్రశ్నించారు. కంచ గచ్చిబౌలి, లగచర్ల, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీతో పాటు రాయదుర్గ్ తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల విక్రయాలకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. “ఇంచు ప్రభుత్వ భూమిని కూడా అమ్మబోమని ఇచ్చిన హామీ ఏమైంది?” అని నిలదీశారు.

హెరిటేజ్ భూముల వేలంపై అభ్యంతరం

రాయదుర్గ్ పరిధిలోని పన్మక్త గ్రామం సర్వే నంబర్ 83/1లో ఉన్న 10.63 ఎకరాల హెరిటేజ్ భూమిని ఆగస్టు 17, 21 తేదీల్లో TGIIC ద్వారా వేలం వేయడానికి సిద్ధమవడం సరికాదని హరీశ్‌రావు అన్నారు. ఈ భూములను కాపాడాలని గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి కోర్టును ఆశ్రయించారని గుర్తుచేశారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత అదే భూములను విక్రయించేందుకు ఎందుకు తొందరపడుతున్నారని ప్రశ్నించారు.

ఈ భూములపై ఇప్పటికే వివాదాలు, న్యాయపరమైన అంశాలు ఉన్నాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఇదే సర్వే నంబర్‌లో గతంలో 6.2 ఎకరాల భూమిని ఎకరాకు సుమారు రూ.237 కోట్ల చొప్పున వేలం వేయగా.. ఎస్‌బీఐ కోర్టును ఆశ్రయించిందని తెలిపారు. ప్రస్తుతం ఆ వ్యవహారం హైకోర్టు పరిధిలో ఉన్నప్పటికీ అదే సర్వే నంబర్‌లో మరో 10.63 ఎకరాలను వేలానికి పెట్టడం వెనుక కారణమేంటని ప్రశ్నించారు.

రూ.2 వేల కోట్ల భూమి ఎందుకు అమ్మాలి?

సుమారు రూ.2 వేల కోట్ల విలువైన హెరిటేజ్ భూములను విక్రయించే అధికారం కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎవరిచ్చారని హరీశ్‌రావు నిలదీశారు. భూమిపై హక్కులు, వివాదాలు పూర్తిగా పరిష్కారం కాకముందే వేలం నిర్వహించడం వల్ల భవిష్యత్తులో న్యాయపరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు. భూమి ఎవరిదో తేల్చకుండా అమ్మకానికి మాత్రం ప్రభుత్వం ఎందుకు తొందరపడుతోందని ప్రశ్నించారు. వివాదాస్పద ఆస్తుల విషయంలో కొత్తగా మూడో వ్యక్తుల హక్కులు ఏర్పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సర్వే నంబర్ 83కు సంబంధించిన హెరిటేజ్, రెవెన్యూ, సర్వే, వక్ఫ్ రికార్డులను పూర్తిగా పరిశీలించి వాస్తవాలను వెలికితీయాలని డిమాండ్ చేశారు.

‘వేలాలను వెంటనే నిలిపివేయాలి’

ఆగస్టు 17, 21 తేదీల్లో ప్రతిపాదించిన TGIIC వేలాలను తక్షణమే నిలిపివేయాలని హరీశ్‌రావు కోరారు. అన్ని రికార్డులను పరిశీలించి భూములపై ఉన్న హక్కులు, వివాదాలను స్పష్టంగా తేల్చిన తర్వాతే ప్రభుత్వం తదుపరి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. వివాదాలు పరిష్కారం కాకుండానే ఎవరైనా ఈ భూములను కొనుగోలు చేస్తే భవిష్యత్తులో న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు.

ప్రభుత్వ భూములను కాపాడుతామని గతంలో చెప్పిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు వేలాలపై ఎందుకు ముందుకు వెళ్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వ భూములను విక్రయించబోమని చెప్పిన రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హామీకి కూడా విలువ లేకుండా పోయిందా అని ప్రశ్నించారు.

“భవిష్యత్ తరాలకు అందాల్సిన విలువైన హెరిటేజ్ భూములను అమ్మడం బాధ్యతాయుత పాలన కాదు. రియల్ ఎస్టేట్ వ్యాపారిలా కాకుండా తెలంగాణ ముఖ్యమంత్రిగా వ్యవహరించాలి. వ్యక్తిగత ప్రయోజనాల కంటే రాష్ట్ర ప్రజల ప్రయోజనాలు, తెలంగాణ ఆస్తుల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి” అని హరీశ్‌రావు తన లేఖలో పేర్కొన్నారు. ప్రభుత్వ భూముల విషయంలో పారదర్శకత పాటించాలని, వివాదాలు పరిష్కరించిన తర్వాతే ఎలాంటి నిర్ణయమైనా తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# స్వార్థం నిరూపిస్తే రాజకీయాలు వదిలేస్తా!’

మొదటి పేజీ తరువాయి


“నా మాటల వెనుక ఎలాంటి రాజకీయం, రహస్యం లేదు. నేను డబ్బులకు అమ్ముడుపోయే వ్యక్తిని కాదు. ప్రజల కోసమే నా జీవితం. నియోజకవర్గ అభివృద్ధి కోసమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మద్దతు తెలిపాను” అని పోచారం పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధిని కూడా ఉన్నది ఉన్నట్లుగా చెబుతానని, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న పనులను కూడా అదే విధంగా ప్రస్తావిస్తానని అన్నారు.

అన్నం పెట్టిన వారిని మర్చిపోవడం తన నైజం కాదని పోచారం వ్యాఖ్యానించారు. “పోరాటం చేస్తా తప్ప.. తలవంచే రాజకీయం చేయను. నా ప్రజల కోసం, నియోజకవర్గ అభివృద్ధి కోసం ఏమైనా చేస్తా. ఎమ్మెల్యేగా ప్రభుత్వ సహకారం అవసరం. అది లేకుంటే అభివృద్ధి పనులు చేయలేం” అని స్పష్టం చేశారు.

ఇటీవల బీర్కూరులో కార్యకర్తల ఆత్మీయ సమావేశంలోనూ పోచారం తన పార్టీ మార్పు, నియోజకవర్గ అభివృద్ధిపై వ్యాఖ్యలు చేశారు. పెండింగ్ బిల్లులను ఆరు నెలల్లో మంజూరు చేస్తామని సీఎం హామీ ఇచ్చినా సగం నిధులు మాత్రమే విడుదలయ్యాయని తెలిపారు. బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో గుత్తేదారులు పనులు నిలిపివేశారని పేర్కొన్నారు.

నవంబర్‌లో ఫిరాయింపు ఎమ్మెల్యేల సమావేశం జరిగినప్పుడు సీఎం రేవంత్‌రెడ్డిని నేరుగా ప్రశ్నించానని పోచారం తెలిపారు. సీఎం హామీ ఇచ్చినప్పటికీ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నిధులు మంజూరు చేయలేదని అప్పట్లో ఆయన విమర్శించారు. కేసీఆర్ హయాంలోనే తన నియోజకవర్గంలో అభివృద్ధి జరిగిందని చెప్పిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చకు దారితీశాయి. తాజాగా వాటిపై పోచారం మరోసారి స్పష్టత ఇచ్చారు.

# కాంగ్రెస్‌తో సంబంధం లేనివారికి ప్రభుత్వంలో కీలక పదవులు: కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 13(ఇది కద నిజం): కాంగ్రెస్ పార్టీతో సంబంధం లేని కొంతమంది నేడు ప్రభుత్వంలో కీలక పదవులు అనుభవిస్తుండటం బాధాకరమని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. తాను ప్రతిపక్షంలో ఉన్నా.. అధికారంలో ఉన్నా ప్రజల పక్షాన నిలబడతానని చెప్పారు. రవీంద్రభారతిలో కళాకారుడు ఏపూరి సోమన్న 25 ఏళ్ల పాటల ప్రస్థానంపై రూపొందించిన పుస్తకాన్ని రాజగోపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు.

“గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తొలిసారిగా గళం విప్పింది నేనే. అందుకే అప్పటి సీఎం కేసీఆర్ లక్ష్యంగా చేసుకున్నారు. మునుగోడులో నన్ను ఓడించేందుకు 100 మంది ఎమ్మెల్యేలను రంగంలోకి దించారు. ఏపూరి సోమన్న లాంటి కళాకారులకు అండగా ఉంటా. నేను గెలిపించిన ఓ ఎమ్మెల్యే కులం కార్డు అడ్డుపెట్టుకుని అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారు. రాజకీయాలను మార్చే శక్తి నాకుంది.. నిజాయతీ కలిగిన వారు నా వెంట నిలిస్తే తమిళనాడు తరహాలో రాజకీయ మార్పు తీసుకురాగలం” అని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు.

# కాంగ్రెస్ వాళ్లకు కర్రు కాల్చి వాత పెట్టడం ఖాయం: ఆర్‌ఎస్పీ

మొదటి పేజీ తరువాయి

రివ్యూలు చేయడానికి రూ.200 కోట్లతో భోదీ పెవిలియన్ కట్టుకున్న సీఎం 8 పథకాల జీవోలపై ఎందుకు రివ్యూ చేయలేదని నిలదీశారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్‌పై ఎవరూ కోర్టులో పిటీషన్ వేయలేదని తెలిపారు. అడ్వకేట్ జనరల్‌కు కేసును వాదించమని సీఎం ఎందుకు చెప్పలేదన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ నోడల్ ఏజెన్సీ పొన్నం ప్రభాకర్ అని.. ఆయనకు తాడు, బొంగరం ఉంటే పిటీషన్‌పై ఎందుకు రివ్యూ చేయలేదని ప్రశ్నించారు. గ్రహచార భవన్‌లో కూర్చుని కాంగ్రెస్ వాళ్లు పూజలు చేపిస్తున్నారని ఆరోపించారు. రివ్యూ చేశారో లేదో గన్ పార్క్ వద్ద చర్చకు పొన్నం ప్రభాకర్, మంత్రులు సిద్ధమా అని సవాల్ విసిరారు. పథకాలను చంపాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని ఆరోపించారు.

మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారిందన్నారు. రేవంత్ దొర బిడ్డ అని.. మిగతా మంత్రులు ఏం చేస్తున్నారని నిలదీశారు. ఊర్లలోకి వచ్చే కాంగ్రెస్ వాళ్లకు కర్రు కాల్చి వాత పెట్టడం ఖాయమని హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, సుమిత్రానంద్, సత్య, అబ్రార్ పాల్గొన్నారు.

# ‘మీ భూమి ఎక్కడికీ పోదు.. నేనే రిజిస్ట్రేషన్ చేయిస్తా’

మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనే హౌసింగ్ బోర్డు కాలనీలు నిర్మితమయ్యాయని సీఎం గుర్తుచేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన ఆయన.. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. నగరానికి దూరంగా ఇళ్లు నిర్మించడం వల్ల ప్రజలు ఉపాధి అవకాశాలకు దూరమయ్యారని విమర్శించారు.

‘నెలకు రూ.7 వేల కోట్ల వడ్డీ’

గత ప్రభుత్వం చేసిన అప్పులకు తమ ప్రభుత్వం నెలకు సుమారు రూ.7 వేల కోట్ల మేర వడ్డీలు చెల్లిస్తోందని రేవంత్‌రెడ్డి తెలిపారు. అప్పులతో దెబ్బతిన్న రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దుతూ తెలంగాణను అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్నామని అన్నారు.

తమ ప్రభుత్వం ఇప్పటికే 70 వేల ఉద్యోగాలు భర్తీ చేసిందని సీఎం వెల్లడించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ చీరలు, సన్నబియ్యం వంటి పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా అందేలా జీహెచ్ఎంసీని మూడు భాగాలుగా విభజించామని పేర్కొన్నారు.

‘సోషల్ మీడియా ప్రచారాన్ని నమ్మొద్దు’

సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని ముఖ్యమంత్రి కోరారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై వాస్తవాలను గమనించాలని సూచించారు. ఎలాంటి ఒడుదొడుకులు ఎదురైనా తాను ప్రజల కోసం పనిచేస్తూనే ఉంటానని, ప్రజలు ప్రభుత్వానికి అండగా నిలవాలని రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# తెలంగాణలో ‘స్మార్ట్ రేషన్ కార్డులు’ పంపిణీ

మొదటి పేజీ తరువాయి

అత్యంత ఆధునికమైన డిజైన్‌తో రూపొందించిన ఈ స్మార్ట్ రేషన్ కార్డులో భద్రత, స్పష్టతకు అత్యధిక ప్రాధాన్యతను ఇచ్చారు. కార్డు ముందు భాగంలో సీఎం రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫొటోలు ఉన్నాయి. వాటితో పాటు రేషన్ కార్డు నంబర్, కుటుంబ యజమాని పేరు, సంబంధిత రేషన్ షాపు నంబర్ వంటి కీలక వివరాలు ముద్రించి ఉన్నాయి. ఇక వెనుక భాగంలో కార్డు దుర్వినియోగం కాకుండా ఉండటానికి ప్రత్యేకమైన హోలోగ్రామ్ , తక్షణ సమాచారం కోసం క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేశారు. అదేవిధంగా లబ్ధిదారుడి గ్రామం, ప్రాంతం, మండలం, జిల్లా, పూర్తి చిరునామా వివరాలను పొందుపరిచారు. ఈ స్మార్ట్ కార్డుల ద్వారా రేషన్ సరుకుల పంపిణీ ప్రక్రియ మరింత పారదర్శకంగా మారుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

# భూ కేటాయింపులపై బీఆర్ఎస్ రాజకీయం చేస్తోంది: ఎంపీ చామల

దిల్లీ, ఆగస్టు 13(ఇది కద నిజం): టెస్సరాక్ట్ సంస్థకు కేటాయించిన భూములపై బీఆర్ఎస్ రాజకీయం చేస్తోందని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. దిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ ఎంపీలతో కలిసి ఆయన మాట్లాడారు. ‘ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్‌లో బీఆర్ఎస్ హయాంలో 54 కంపెనీలకు భూ కేటాయింపులు జరిగాయి. వారి హయాంలో ఎకరాకు రూ.30లక్షల నుంచి రూ.80లక్షల చొప్పున ఇచ్చారు. మా ప్రభుత్వం వచ్చాక 8 కంపెనీలకు భూ కేటాయింపులు జరిగాయి. ఎకరా రూ.1.50 కోట్లకు కేటాయించాం. 5 ఎకరాలు కావాలని టెస్సరాక్ట్ సంస్థ 2024లో దరఖాస్తు చేసుకుంది. ఏడాదిపాటు పరిశీలించి ఆ సంస్థకు 2025లో భూమిని కేటాయించాం. అందరికీ కేటాయించినట్టుగానే ఆ సంస్థకు కూడా ఎకరా రూ.1.50 కోట్ల చొప్పున ఇచ్చాం. 2025 వరకు టెస్సరాక్ట్ సంస్థకు కొండల్‌రెడ్డి డైరెక్టర్, మేనేజింగ్ డైరెక్టర్ కాదు” అని ఎంపీ చామల వివరించారు.

# యూనిటీ మాల్ ఒప్పందంపై విచారణ జరపాలి

మొదటి పేజీ తరువాయి

‘కేటీఆర్ తప్పు చేస్తే విచారణ.. కాంగ్రెస్ చేస్తే ఎందుకు కాదు?’

కేటీఆర్ ఆరోపణలపై విచారణ జరపాలని కోరుతున్న కాంగ్రెస్.. తాను అధికారంలో ఉన్నప్పుడు జరిగిన వ్యవహారాలపై కూడా అదే స్థాయిలో దర్యాప్తును ఎదుర్కోవాలని రఘునందన్‌రావు అన్నారు. “కేటీఆర్ తప్పు చేస్తే విచారణ జరగాలి. కాంగ్రెస్ తప్పు చేస్తే విచారణ ఎందుకు ఉండకూడదు?” అని ప్రశ్నించారు.

2018లో బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో సుమారు 10 ఎకరాల భూమిని ఓ ప్రైవేట్ సంస్థకు కేటాయించిన వ్యవహారంపైనా దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. యూనిటీ మాల్ భూకేటాయింపు, గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన భూకేటాయింపులు.. రెండింటినీ ఒకే ప్రమాణాలతో పరిశీలించాలని స్పష్టం చేశారు.

విజిలెన్స్ కమిషన్‌కు ఫిర్యాదు

యూనిటీ మాల్ ఒప్పందంతో పాటు గత బీఆర్ఎస్ ప్రభుత్వ భూకేటాయింపులపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలని కోరుతూ కేంద్ర విజిలెన్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు రఘునందన్‌రావు తెలిపారు. ప్రభుత్వ భూముల విషయంలో పూర్తి పారదర్శకత అవసరమని అన్నారు.

హైదరాబాద్‌లో ప్రభుత్వ భూముల విలువ ఎకరాకు వందల కోట్లకు చేరిన పరిస్థితుల్లో.. ప్రజల ఆస్తులను విక్రయించే హక్కు ప్రభుత్వాలకు లేదని ఆయన వ్యాఖ్యానించారు. “ప్రభుత్వాలు ప్రజల ఆస్తులకు కస్టోడియన్లుగా ఉండాలి.. యజమానులుగా వ్యవహరించకూడదు” అని స్పష్టం చేశారు.

కాళేశ్వరంపై పూర్తి స్థాయి సీబీఐ దర్యాప్తు

కాళేశ్వరం ప్రాజెక్టుపైనా ఎంపీ కీలక డిమాండ్ చేశారు. కేవలం మూడు బ్యారేజీలకే పరిమితం కాకుండా డీపీఆర్ తయారీ నుంచి చివరి చెల్లింపు వరకు మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణ జరపాలని కోరారు.

కాళేశ్వరం వ్యవహారంపై కేంద్రానికి లేఖ రాయాలని సీఎం రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. ఈ అంశంపై కేంద్ర హోంమంత్రిని కలిసి పూర్తి స్థాయి దర్యాప్తు కోసం ప్రయత్నిస్తానని తెలిపారు. రింగ్ రోడ్డు, ఫార్ములా-ఈ రేస్, కాళేశ్వరం వంటి అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఖరిని మార్చుకుందని రఘునందన్‌రావు విమర్శించారు.

‘అవినీతిలో ఇద్దరూ అన్నదమ్ములే’

కాంగ్రెస్, బీఆర్ఎస్ పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మళ్లిస్తున్నాయని ఎంపీ ఆరోపించారు. “అవినీతి విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ అన్నదమ్ముల్లా వ్యవహరిస్తున్నాయి” అంటూ విమర్శలు గుప్పించారు.

తెలంగాణలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందని ప్రజలను బీజేపీ కోరుతోందన్నారు. రాష్ట్ర ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, వాటిని తమ సొంత ఆస్తుల్లా విక్రయించే విధానం సరికాదని రఘునందన్‌రావు స్పష్టం చేశారు.

# ‘హార్ముజ్ మా కంట్రోల్‌లోనే ఉంది!’

మొదటి పేజీ తరువాయి

వ్యూహాత్మకమైన ఈ జలమార్గం తమ నియంత్రణలోనే ఉందని స్పష్టం చేసింది. ఇరాన్ పారామిలిటరీ బసీజ్ దళాల అధిపతి, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్‌కు అనుబంధమైన హుస్సేన్ తాయెబ్ ఈ విషయాన్ని ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్‌లో వెల్లడించారు.

“హార్ముజ్ జలసంధి ఇస్లామిక్ రిపబ్లిక్ నిర్వహణ, నియంత్రణలోనే ఉంది. మా దేశం పూర్తి భద్రతతో తన మార్గంలో కొనసాగుతోంది” అని తాయెబ్ పేర్కొన్నారు.

అంతకుముందు ట్రంప్ ‘ట్రూత్ సోషల్’ వేదికగా స్పందిస్తూ.. హార్ముజ్ జలసంధిపై అమెరికా పూర్తి నియంత్రణ సాధించిందని ప్రకటించారు. అమెరికా నౌకా దిగ్బంధనాన్ని ‘వాల్ ఆఫ్ స్టీల్’ గా అభివర్ణించిన ఆయన.. దాన్ని ఎదుర్కొనే సామర్థ్యం ఇరాన్‌కు లేదని వ్యాఖ్యానించారు.

‘అమెరికా మరోసారి తప్పుగా అంచనా వేస్తోంది’

హార్ముజ్‌పై అమెరికా వాదనను ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి కూడా ఖండించారు. నిఘా వైఫల్యాల కారణంగా అమెరికా చాలాకాలంగా పరిస్థితులను తప్పుగా అంచనా వేస్తోందని విమర్శించారు. ఇరాన్‌పై యుద్ధమే ఇందుకు ఉదాహరణ అని, ఇప్పుడు హార్ముజ్ విషయంలో అంతకంటే పెద్ద తప్పిదానికి పాల్పడుతోందని ఆరోపించారు.

హార్ముజ్‌పై ఆంక్షలు విధిస్తే అమెరికా, ఇజ్రాయెల్‌కు చెందిన నౌకలను లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ పార్లమెంట్ సభ్యులు హెచ్చరించారు. అమెరికా సైనిక నౌకలను సైతం జలసంధి మీదుగా అనుమతించబోమని స్పష్టం చేశారు.

హార్ముజ్‌కు ప్రత్యామ్నాయ మార్గం?

హార్ముజ్ జలసంధికి ప్రత్యామ్నాయ మార్గాన్ని ఏర్పాటు చేసే అంశంపై ఇరాన్, ఒమన్ మధ్య చర్చలు జరుగుతున్నాయి. అయితే ఇప్పటివరకు తుది నిర్ణయం తీసుకోలేదు. ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటైనా హార్ముజ్‌ను పూర్తిగా తెరవబోమని ఇరాన్ స్పష్టం చేసింది.

జలమార్గాన్ని పూర్తిస్థాయిలో పునఃప్రారంభించాలంటే అమెరికా తమ విస్తృత డిమాండ్లను నెరవేర్చాల్సిందేనని తేహ్రాన్ తేల్చిచెప్పింది. దీంతో ప్రపంచ ఇంధన సరఫరాకు కీలకమైన హార్ముజ్ జలసంధి.. అమెరికా-ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలకు మరోసారి కేంద్రంగా మారింది.

# గాంధీ పుట్టిన దేశంలో ప్రజాస్వామ్యానికి సంకెళ్లు!

అమరావతి,13 ఆగస్టు (ఇది కద నిజం):: రాష్ట్రంలో ‘రెడ్ బుక్ రాజ్యాంగం’ పేరుతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోపించారు. ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్ట్, ఆయనను జైలుకు పంపిన తీరు రాష్ట్రంలో బాధితులే నిందితులుగా మారుతున్న పరిస్థితికి నిదర్శనమని విమర్శించారు. ప్రభుత్వ అన్యాయాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆరోపించారు.చంద్రబాబు డైరెక్షన్‌లోనే ఈ వ్యవహారాలు జరుగుతున్నాయని జగన్ విమర్శించారు. రాత్రి 2.45 గంటల సమయంలో వందలాది మంది పోలీసులు ఎమ్మెల్యే విరూపాక్షి ఇంటికి వచ్చి డోర్లు, సీసీ కెమెరాలు ధ్వంసం చేసి ఆయనను తీసుకెళ్లారని ఆరోపించారు. పగటిపూట నోటీసులు ఇచ్చి అరెస్ట్ చేయవచ్చుకదా.. ఆయన ఏమైనా ఉగ్రవాదా? అని ప్రశ్నించారు.

కొద్ది గంటల వ్యవధిలోనే ఎమ్మెల్యేపై మూడు కేసులు నమోదు చేయడంతో పాటు ఆయన కుమారుడు, తమ్ముడు, తమ్ముడి కుమారుడిని కూడా కేసుల్లో ఇరికించారని జగన్ ఆరోపించారు.

‘బాధితుడినే నిందితుడిని చేశారు’

ఆగస్టు 1న సంగాల గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త గిరిపై దాడి జరుగుతుండగా.. అతడిని రక్షించేందుకు ఎమ్మెల్యే విరూపాక్షి అక్కడికి వెళ్లారని జగన్ తెలిపారు. స్థానిక ఎస్పై, సీఐలకు ఫోన్ చేసినా పోలీసులు స్పందించకపోవడంతోనే ఎమ్మెల్యే స్వయంగా వెళ్లాల్సి వచ్చిందన్నారు.

తర్వాత నెమకల్లు వద్ద ఎమ్మెల్యేపై దాడి చేసి, ఆయన తమ్ముడి చేయి విరగ్గొట్టారని జగన్ ఆరోపించారు. ఈ ఘటనను కప్పిపుచ్చేందుకు ఓ టీడీపీ కార్యకర్త తన భార్య దుస్తులను తానే చించి, ఆ నెపాన్ని ఎమ్మెల్యేపై మోపి ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టించారని తీవ్ర ఆరోపణలు చేశారు.

ఈ వ్యవహారానికి సంబంధించిన వీడియోలు కూడా బయటకు వచ్చాయని జగన్ పేర్కొన్నారు. మహిళతో తప్పుడు ప్రకటనలు ఇప్పిస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై ప్రజాస్వామ్యవాదులంతా ఆలోచించాలని జగన్ పిలుపునిచ్చారు.

# ‘ఇది ఆరంభం మాత్రమే.. అమరావతి నంబర్ వన్ రాజధాని!’

అమరావతి ,ఆగస్టు 13(ఇది కద నిజం):: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణం ఇప్పుడే ప్రారంభమైందని, భవిష్యత్తులో దేశంలోనే అత్యుత్తమ రాజధానిగా అమరావతి నిలుస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రాజధాని అభివృద్ధి ఇకపై ఎలాంటి ఆటంకాలు లేకుండా వేగంగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. అమరావతిని అనుసంధానించే కీలకమైన సీడ్ యాక్సెస్ రోడ్డులోని ఈ-3 మార్గాన్ని ప్రారంభించిన సందర్భంగా సీఎం మాట్లాడారు. ఉండవల్లి వద్ద సీడ్ యాక్సెస్ రోడ్డుకు అనుసంధానంగా నిర్మించిన స్టీల్ బ్రిడ్జిలకు సంబంధించిన పనులను కూడా ప్రారంభించారు.అమరావతి అభివృద్ధి విషయంలో రాష్ట్ర ప్రజలు సానుకూలంగా ఆలోచించాలని చంద్రబాబు కోరారు. రాజధాని నిర్మాణం ఇక ‘అన్‌స్టాపబుల్’గా కొనసాగుతుందని అన్నారు. ప్రధాన రహదారులు, వంతెనలు, ఇతర మౌలిక వసతుల నిర్మాణంతో అమరావతి రూపురేఖలు వేగంగా మారనున్నాయని పేర్కొన్నారు.

96 కి.మీ. ఇన్నర్.. 190 కి.మీ. ఔటర్ రింగ్

అమరావతి చుట్టూ భారీ రహదారి నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయనున్నట్లు చంద్రబాబు వెల్లడించారు. ఇందులో భాగంగా 96 కిలోమీటర్ల ఇన్నర్ రింగ్ రోడ్డు, 190 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టులకు కేంద్రం కూడా ఆమోదం తెలుపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇప్పటికే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమరావతి అభివృద్ధి పనులను ప్రారంభించారని గుర్తుచేసిన చంద్రబాబు.. 2028లో దేశం మెచ్చేలా నిర్మించిన అమరావతిని ప్రారంభించేందుకు ప్రధాని మరోసారి వస్తారని తెలిపారు. వాస్తుపరంగా కూడా అమరావతి ప్రత్యేకమైన ప్రాంతమని, సీడ్ యాక్సెస్ రోడ్డు పూర్తయిన తర్వాత రాజధాని అభివృద్ధికి మరింత వేగం వస్తుందని చెప్పారు.

అమరావతి ఉద్యమంలో పవన్ పాత్ర

అమరావతి రాజధాని ఉద్యమానికి జనసేన అధినేత పవన్ కల్యాణ్ అందించిన మద్దతును చంద్రబాబు గుర్తుచేశారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో విధ్వంసకర నిర్ణయాలు తీసుకున్నారని విమర్శించిన ఆయన.. అమరావతి కోసం రైతులు చేపట్టిన ఉద్యమానికి పవన్ అండగా నిలిచారని అన్నారు.

రైతుల పోరాటానికి మద్దతుగా పవన్ కల్యాణ్ ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నారని, అమరావతి కోసం తన కుటుంబం నుంచి కూడా విరాళం అందించారని చంద్రబాబు పేర్కొన్నారు. అన్ని అడ్డంకులను అధిగమించి రాజధాని నిర్మాణాన్ని తిరిగి పట్టాలెక్కించామని చెప్పారు.

విద్యుత్ తీగలు కనిపించని నగరం

అమరావతిని ఆధునిక మౌలిక వసతులతో తీర్చిదిద్దుతున్నామని సీఎం తెలిపారు. విద్యుత్ తీగలు, కరెంట్ స్తంభాలు కనిపించకుండా ఆధునిక వ్యవస్థను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రతి ఇంటికి మెరుగైన విద్యుత్ సరఫరా అందేలా చర్యలు తీసుకుంటామని, గ్యాస్‌పై ఆధారపడకుండా వంట చేసుకునే సౌకర్యాలను కూడా కల్పించే దిశగా ప్రణాళికలు ఉన్నాయని వెల్లడించారు.

కృష్ణా నది తీరంలో నిర్మితమవుతున్న అమరావతికి సమృద్ధిగా నీటి వనరులు ఉన్నాయని చంద్రబాబు అన్నారు. ప్రకృతి వనరులను సమర్థంగా వినియోగించుకుంటూ పర్యావరణహిత, ఆధునిక నగరంగా రాజధానిని అభివృద్ధి చేస్తామని చెప్పారు.

బ్లూ సిటీ.. గ్రీన్ సిటీ.. గ్రీన్ ఎనర్జీ సిటీ

అమరావతిని కాలుష్యరహిత నగరంగా తీర్చిదిద్దడంతో పాటు బ్లూ సిటీ, గ్రీన్ సిటీ, గ్రీన్ ఎనర్జీ సిటీగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు చంద్రబాబు తెలిపారు. ఆధునిక సాంకేతికతను విస్తృతంగా వినియోగించి భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నగరాన్ని నిర్మిస్తామని చెప్పారు.

# కుత్బుల్లాపూర్‌లో దేశభక్తి చాటిన యువత

## • తిరంగా ర్యాలీ ఘన విజయంపై నల్ల జై శంకర్ గౌడ్ హర్షం




ఇది కద నిజం,కుత్బుల్లాపూర్: భారతీయ జనతా యువమోర్చా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఆధ్వర్యంలో నిర్వహించిన తిరంగా ర్యాలీ అత్యంత ఘనంగా సాగిందని బీజేపీ నాయకులు నల్ల జై శంకర్ గౌడ్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఐడీపీఎల్ ఎక్స్ రోడ్ నుండి కుత్బుల్లాపూర్ మున్సిపల్ సర్కిల్ కార్యాలయం వరకు సాగిన ఈ భారీ ర్యాలీలో సుమారు 4,000 మంది విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని తమ దేశభక్తిని చాటారని ఆయన పేర్కొన్నారు. దేశభక్తి మన గుండెల్లో, తిరంగా మన చేతుల్లో, భారతమాత మన హృదయాల్లో ఉందనే నినాదంతో సాగిన ఈ కార్యక్రమానికి ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షులు డి. గిరి వర్ధన్ రెడ్డి , జిల్లా నాయకులు, మాజీ కార్పొరేటర్లు, పార్టీ కార్యకర్తలు హాజరై మరింత ఉత్సాహాన్ని అందించారని జై శంకర్ గౌడ్ తెలిపారు. ఈ ర్యాలీలో విద్యార్థులు, యువత ప్రదర్శించిన ఉత్సాహం, క్రమశిక్షణ, దేశభక్తి ఎంతో అభినందనీయమని నల్ల జై శంకర్ గౌడ్ కొనియాడారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్క విద్యార్థికి, యువతకు ఆయన హృదయపూర్వక అభినందనలు మరియు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే ర్యాలీ విజయవంతం కోసం అహర్నిశలు కృషి చేసిన బీజేవైఎం వాలంటీర్లు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, నిర్వాహకులు మరియు సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. అందరి సమిష్టి కృషి వల్లే ఈ తిరంగా ర్యాలీ ఇంతటి ఘన విజయాన్ని సాధించిందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్. మల్లారెడ్డి , కొల్లి మాధవి , తాదూరి శ్రీనివాస్, కాంతారావు, శేఖర్ యాదవ్, రావుల శేషగిరి, విఘ్నేష్, వేముల రమేష్, గారిగే శేఖర్, పులి బలరాం, సుబ్బారావు, నందనం దివాకర్, రాజా సదానందం, రాజేష్ చారి, ఝాన్సీ, నాగదీప్, శ్యామ్ కిరణ్ రెడ్డి, శ్రీనాథ్, పృథ్వీ తదితరులు పాల్గొని విజయవంతం చేశారని నల్ల జై శంకర్ గౌడ్ వివరించారు.

# జమ్మికుంట-పాపయ్యపల్లి మధ్య ఆర్ఓబీ అలైన్‌మెంట్ పరిశీలన: అధికారుల సంయుక్త తనిఖీ




ఇది కద నిజం,జమ్మికుంట: దక్షిణ మధ్య రైల్వే సంస్థ చేపట్టిన రైల్వే లైన్ విస్తరణ, ఆధునీకరణ పనుల్లో భాగంగా జమ్మికుంట మండల పరిధిలో నిర్మించ తలపెట్టిన రోడ్డు ఓవర్ బ్రిడ్జిల అలైన్‌మెంట్‌ను గురువారం వివిధ శాఖల అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కాజీపేట - బల్లార్షా సెక్షన్ల మధ్య ఎల్‌సీ-20 (కి.మీ 332/28-20) జమ్మికుంట మడిపల్లి క్రాస్, అలాగే ఎల్‌సీ-25 (కి.మీ 323/12-14) పాపయ్యపల్లి గ్రామాల పరిధిలో ఈ రోడ్డు ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి జాయింట్ ఇన్స్పెక్షన్ నిర్వహించారు. రైల్వే లైన్ అభివృద్ధిలో భాగంగా లెవల్ క్రాసింగ్ ల వద్ద రోడ్డు ఓవర్ బ్రిడ్జిలు, రోడ్డు అండర్ బ్రిడ్జిలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిల ఏర్పాటుకు రైల్వే శాఖ శ్రీకారం చుట్టిన నేపథ్యంలో ఈ తనిఖీలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈ సంయుక్త తనిఖీ కార్యక్రమంలో భాగంగా హుజూరాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారి ఎన్. జలకుమారి, జమ్మికుంట తహశీల్దార్ జి. సుధాకర్, రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ సుందర్, రోడ్ సెక్టార్ ప్రాజెక్టు రైల్వే భూసేకరణ నిపుణులు పి. దేవరాజులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల పరిధిలోని రైతులు, గ్రామ పెద్దలకు బ్రిడ్జిల అలైన్‌మెంట్‌కు సంబంధించిన వివరాలను అధికారులు నిశితంగా వివరించారు. భూసేకరణ, ప్రజా రవాణాకు ఇబ్బంది లేకుండా ప్రాజెక్టును ఎలా ముందుకు తీసుకెళ్లాలనే అంశంపై స్థానిక ప్రజలు, రైతుల నుంచి సలహాలు, సూచనలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు జి. శంకరయ్య, ఎన్. సత్యనారాయణలతో పాటు ఆర్అండ్‌బీ , పంచాయతీరాజ్, నీటిపారుదల శాఖ , మిషన్ భగీరథ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు, పాపయ్యపల్లి గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# అత్తాపూర్‌లో మిన్నంటిన దేశభక్తి

## • ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ






ఇది కద నిజం,రాజేంద్రనగర్: భారతదేశ భవిష్యత్తు అయిన యువత, విద్యార్థులు మరియు ప్రజల గుండెల్లో దేశభక్తి భావాన్ని పెంపొందించడమే లక్ష్యంగా అత్తాపూర్ డివిజన్ లో 'హర్ ఘర్ తిరంగా' భారీ ర్యాలీ ఘనంగా జరిగింది. బీజేపీ అత్తాపూర్ డివిజన్ అధ్యక్షులు సులుగే వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దేశభక్తి ర్యాలీ హైదర్‌గూడలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు మొండ్రా కొమురయ్య ముఖ్యఅతిథులుగా హాజరై, జెండా ఊపి ర్యాలీని ప్రారంభించి ప్రసంగించారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్ఫూర్తిని, వారి ఆశయాలను స్మరిస్తూ ప్రారంభమైన ఈ ర్యాలీ జనప్రియ చౌరస్తా మీదుగా సాగుతూ దేశ సమగ్రత కోసం అహర్నిశలు శ్రమించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం వద్దకు చేరుకుని ముగిసింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు మాట్లాడుతూ దేశ సార్వభౌమత్వాన్ని చాటిచెప్పేలా ప్రతి ఒక్కరూ తమ తమ ఇంటి పైన జాతీయ జెండాను సగర్వంగా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. యువతలో జాతీయ స్ఫూర్తిని, ఐక్యతను నింపేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ర్యాలీ పొడవునా యువత, ప్రజలు మిన్నంటేలా చేసిన దేశభక్తి నినాదాలతో ఆ ప్రాంతమంతా మారుమోగింది. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరిస్తూ సాగిన ఈ ప్రదర్శన స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కాడం సుధాకర్, జిల్లా పార్టీ సెక్రటరీ విజయకుమార్, కిరణ్ చారి, సిద్దేశ్వర్, జయానంద్ రెడ్డి, కృష్ణ, రాజు పైల్వాన్, శశికాంత్ శర్మ, వెంకట్ రెడ్డి, శివరాజ్ గౌడ్, అమర్ రెడ్డి, లక్ష్మీకాంత్ రెడ్డి, రాము, భరత్, శ్రీకాంత్, అనురాధ, ఉమా, కొంగల ప్రసాద్, బంటు రమేష్, గుర్విస్ సింగ్, సుధాకర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, అఖిల్, రాకేష్, కార్తీక్, శేఖర్ శెట్టి, బిట్కూరి సతీష్, సుల్గే శ్రీనివాస్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# బొంరాస్‌పేట్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా




ఇది కద నిజం, వికారాబాద్ :వికారాబాద్ జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఐపీఎస్ బొంరాస్‌పేట్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని పలు విభాగాలను పరిశీలించి, శాంతిభద్రతలు, నేర నియంత్రణ, కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, స్టేషన్ రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు.అనంతరం నూతనంగా ఏర్పాటు అవుతున్న బొంరాస్‌పేట్ పోలీస్ స్టేషన్ భవనాన్ని ఎస్పీ గారు పరిశీలించారు. భవన నిర్మాణ పనుల పురోగతిని, పోలీస్ సిబ్బందికి మరియు ప్రజలకు అందుబాటులో ఉండే సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నీతి, నిజాయితీ, నిబద్ధత, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించడం ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజల పట్ల మర్యాదగా, బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, ప్రతి ఫిర్యాదుపై సత్వర స్పందన అందించాలని సూచించారు. పోలీస్ శాఖపై ప్రజలకు మరింత నమ్మకం కలిగేలా పోలీసింగ్ కొనసాగించాలని తెలిపారు.నేరాల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని, పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి నాణ్యమైన దర్యాప్తుతో కేసులను పరిష్కరించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్‌ను మరింత పటిష్టం చేసి, అసాంఘిక కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. మహిళలు, చిన్నారుల భద్రతతో పాటు సైబర్, చీటింగ్ నేరాల నియంత్రణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ప్రజల భద్రత, నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ సిబ్బంది సమిష్టిగా పనిచేయాలని, విధి నిర్వహణలో అప్రమత్తత, క్రమశిక్షణ, నిబద్ధతను ఎల్లప్పుడూ పాటించాలని ఎస్పీ గారు సూచించారు.ఈ కార్యక్రమంలో పరిగి డీఎస్పీ శ్రీనివాస్, పరిగి సీఐ శ్రీ కొండల్ రెడ్డి, బొంరాస్‌పేట్ ఎస్ఐ, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తిరంగాతో కదిలిన పరిగి

## • దేశభక్తి నినాదాలతో మార్మోగిన పట్టణం



ఇది కద నిజం :బీజేపీ పరిగి పట్టణ అధ్యక్షులు బాలకృష్ణ రెడ్డి , పరిగి మండల అధ్యక్షురాలు అనసూయ శ్యామ్ సుందర్ ఆధ్వర్యంలో పరిగి పట్టణ కేంద్రంలో ఘనంగా నిర్వహించిన "హర్ ఘర్ తిరంగా యాత్రలో " బీజేపీ పరిగి అసెంబ్లీ ఇంచార్జ్ మారుతి కిరణ్ బూనేటి ,బీజేపీ నాయకులు శ వెన్న ఈశ్వరప్ప పాల్గొన్నారు. ఈ సందర్భంగా మారుతి కిరణ్ బూనేటి మాట్లాడుతు "తిరంగా మన దేశ గౌరవానికి ప్రతీక. ప్రతి భారతీయుడి గుండెల్లో దేశభక్తి నిండాలి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులను స్మరించుకుంటూ, దేశ ఐక్యత, సమగ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలి. 'హర్ ఘర్ తిరంగా' స్ఫూర్తితో ప్రతి ఇంటా తిరంగ ప్రతి గుండెలో దేశభక్తి ఉండాలి" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు రామచంద్రయ్య, రాము యాదవ్ , కేశవులు, డి. ఆంజనేయులు , పరిగి అసెంబ్లీ కన్వీనర్ ఉగ్ర నరసింహ , పరిగి మండల మాజీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి , రంగంపల్లి గ్రామ సర్పంచ్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముని అశోక్ , రంగంపల్లి గ్రామ ఉపసర్పంచ్, మండల ప్రధాన కార్యదర్శి రమేష్ , మహిళా మోర్చా పరిగి పట్టణ అధ్యక్షురాలు అనూష , జిల్లా మహిళా మార్చనాయకురాలు వాణిశ్రీ గుప్తా , పట్టణ ప్రధాన కార్యదర్శి ఎస్పీ శీను , బీజేపీ నాయకులు కంకల్ రవీందర్ , కన్నయ్యల రాజు , పోల్కంపల్లి భీమయ్య , జిల్లా కార్మిక సెల్ జాయింట్ కన్వీనర్ జోక సురేష్ బాబు , ప్రభాకర్, బీజేవైఎం అసెంబ్లీ కో-కన్వీనర్ మనోహర్ గౌడ్ మరియు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# లో వోల్టేజ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- కొత్త డీటీఆర్‌లు ఏర్పాటు చేస్తాం
- మున్సిపల్ చైర్‌పర్సన్ కుడుముల రజిత వెంకటేష్



ఇది కద నిజం,పరిగి: పరిగి మున్సిపల్ పరిధిలోని ఏ వార్డులోనైనా లో వోల్టేజ్ సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని, ఆయా ప్రాంతాల్లో కొత్త డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ కుడుముల రజిత వెంకటేష్ పేర్కొన్నారు. పట్టణంలోని కొన్ని వార్డులలో లో వోల్టేజ్ సమస్యలు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఈ విద్యుత్ ఇబ్బందులను అధిగమించేందుకు మున్సిపాలిటీ పూర్తిగా కట్టుబడి ఉందని ఆమె గురువారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించబోమని ఆమె భరోసా ఇచ్చారు.పట్టణంలోని ఏ ప్రాంతంలోనైనా విద్యుత్ లో వోల్టేజ్ ఇబ్బందులు తలెత్తితే ప్రజలు వెంటనే మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని చైర్‌పర్సన్ కోరారు. ప్రజల నుండి అర్జీలు అందిన వెంటనే అధికారులు ఆయా ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారని, అవసరాన్ని బట్టి తక్షణమే కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు చర్యలు చేపడతామని వివరించారు. పరిగి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ఎమ్మెల్యే డాక్టర్ రామ్మోహన్ రెడ్డి పూర్తి సహకారం ఉందన్నారు. ఎమ్మెల్యే మద్దతు సహకారంతో పరిగి పట్టణాన్ని విద్యుత్, తాగునీరు, రోడ్లు మరియు ఇతర మౌలిక వసతుల కల్పనలో రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిపేలా అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని చైర్‌పర్సన్ రజిత వెంకటేష్ హామీ ఇచ్చారు. పట్టణ ప్రజలు తమకు ఎలాంటి సమస్యలు ఉన్నా సంకోచించకుండా మున్సిపల్ కార్యాలయాన్ని సంప్రదించి, అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆమె ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

# పెద్దపెండ్యాల రెడ్డి కుల స్మశాన వాటికలో బోరు పనులకు శ్రీకారం



**ఇది కద నిజం , ధర్మసాగర్, ఆగస్టు 13**

హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలం పెద్దపెండ్యాల గ్రామంలోని రెడ్డి కుల స్మశాన వాటికలో నీటి సౌకర్యం కల్పించేందుకు బోరు ఏర్పాటు పనులకు గురువారం శ్రీకారం చుట్టారు. గుర్రాల కుంటకు వెళ్లే దారిలో ఉన్న స్మశాన వాటిక వద్ద గ్రామ సర్పంచ్ తోట నాగరాజు కొబ్బరికాయ కొట్టి బోరు పనులను ప్రారంభించారు.స్మశాన వాటికలో నీటి సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో బోరు ఏర్పాటు చేయడం ద్వారా ఆ సమస్యకు పరిష్కారం లభించనుంది. స్మశాన వాటిక నిర్వహణ, పరిసరాల పరిశుభ్రతకు కూడా నీటి సౌకర్యం ఉపయోగపడనుంది.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కనకం ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శి రఘు, వార్డు సభ్యులు బోల్లెద్ల వికాస్ రెడ్డి, తోట వినేష్, పుండ్రు లింగారెడ్డి, గ్రామ ప్రముఖులు, రెడ్డి కుల సంఘం పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.బోరు పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. స్మశాన వాటికలో నీటి సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకున్న గ్రామ పంచాయతీకి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

# కొత్తూరు మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నూతన కమిటీ ఎన్నిక



రాయపర్తి, ఆగస్టు 13: వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కొత్తూరు మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా/ఎన్నికల ద్వారా ఎన్నుకున్నారు. కొత్తూరులోని స్థానిక సహకార సంఘం కమిటీ భవనంలో జిల్లా మత్స్య సహకార శాఖ ఎన్నికల అధికారులు సందీప్, కృష్ణవేణి, అఫ్జల్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు.ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా భీమని అనిల్, ఉపాధ్యక్షుడిగా భీమని రమేష్, సెక్రటరీగా సంధిరి సాంబయ్య, కోశాధికారిగా కొండ రాజు ఎన్నికయ్యారు. అదేవిధంగా డైరెక్టర్లుగా సింగారబోయిన ఉప్పలయ్య, సింగారబోయిన వెంకన్న, భీమని కృష్ణ, భీమని యాదగిరి, పాక మనీష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని, మత్స్యకారుల సంక్షేమం కోసం అందరినీ కలుపుకుని ముందుకు సాగుతామని తెలిపారు.



# రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**ఇది కద నిజం న్యూస్ వర్ధన్నపేట, ఆగస్టు 13**

ఇల్లంద గ్రామానికి చెందిన మహమ్మద్ యాకుబ్ (52), ఖాజామియా కుమారుడు, రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు.పోలీసుల వివరాల ప్రకారం..యాకుబ్ ప్రతిరోజూ మాదిరిగానే కూలీ పనుల నిమిత్తం వరంగల్‌కు వెళ్లి, తిరిగి మధ్యాహ్నం ఇంటికి వస్తుండేవాడు. ఈ క్రమంలో ఆగస్టు 12న ఉదయం వరంగల్‌కు వెళ్లి, మధ్యాహ్నం సుమారు 3.15 గంటలకు గ్రామంలోని మెయిన్ రోడ్డుపై బేతి సాంబయ్య ఇంటి ఎదుట ఆటో దిగి రోడ్డు దాటుతున్నాడు.అదే సమయంలో వరంగల్ నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న టిఎస్ 09 ఇ కె 0979 నంబర్ గల క్విడ్ కారు డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా వాహనం నడుపుతూ యాకుబ్‌ను ఢీకొట్టాడు. దీంతో ఆయన ఎగిరి రోడ్డుపై పడటంతో తలకు, కాలికి తీవ్ర గాయాలయ్యాయి.స్థానికులు వెంటనే యాకుబ్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా, ఆయన కుమారుడు మహమ్మద్ జామల్ (26) అక్కడికి చేరుకున్నారు.అనంతరం 108 అంబులెన్స్‌లో యాకుబ్‌ను వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే చికిత్స పొందుతూ ఆగస్టు 13న తెల్లవారుజామున సుమారు 4 గంటలకు మృతి చెందాడు.మృతుడి కుమారుడు మహమ్మద్ జామల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వర్ధన్నపేట ఎస్ఐ ఎన్. సాయి బాబు కేసు నమోదు చేసి, ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# కృష్ణాను చెరబట్టిన ఏపీ గోదావరిని కొల్లగొట్టాలని కుట్రలు చేస్తోంది

- జీఆర్ఎంబీ మీటింగ్ వేదిక తెలంగాణకు అన్యాయం చేసే ప్రయత్నాలు
- ఇప్పటికే అనుమతులిచ్చిన ఏడు ప్రాజెక్టుల పర్మిషన్ లను రివ్యూ చేయాలనడం దుర్మార్గం
- ఇంత జరుగుతున్నా నది జలాల పంపిణీపై అవగాహన లేని ముఖ్యమంత్రి గప్ చుప్ గా ఉంటున్నాడు
- టీఆర్ఎస్ ప్రశ్నించే వరకూ అధికార, ప్రతిపక్షాలకు సోయే లేదు
- తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకులు కామెర నవీన్ కుమార్




ఇది కద నిజం ,హైదరాబాద్ :

కృష్ణా నదిని చెరబట్టిన ఏపీ ఇప్పుడు గోదావరి నీళ్లను కొల్లగొట్టేందుకు కుట్రలు చేస్తోందని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకులు కామెర నవీన్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో నీళ్ల విషయంలో తెలంగాణకు చేసిన అన్యాయం చాలదన్నట్లుగా రాష్ట్రం వీడిపోయిన తర్వాత కూడా కూడా ఏపీ నాయకులు అవే కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. గోదావరి నదిలో 273 టీఎంసీల నీటిని అక్రమంగా వాడుకునేందుకు ఏపీ కుట్రలు చేస్తోందన్నారు. ఈ నెల 18 న గోదావరి రివర్ మేనేజ్ మెంట్ బోర్డు (జీఆర్ఎంబీ) మీటింగ్ వేదికగా తెలంగాణ నీటి హక్కులను లాక్కునే కుట్రలకు తెరలేపిందని అన్నారు. బంజారాహిల్స్ లోని తెలంగాణ రక్షణ సేన ప్రధాన కార్యాలయంలో ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రం సాధించుకున్న తర్వాత కూడా నీళ్ల వాటా విషయంలో ఏపీ కుట్రలు కొనసాగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణకు గతంలో ఎప్పుడో ఇచ్చిన ఏడు ప్రాజెక్ట్ ల అనుమతులను కూడా రివ్యూ చేసి రద్దు చేయాలంటూ కేంద్రానికి ఏపీ ప్రభుత్వం లేఖలు రాసిందని చెప్పారు. ఇంత జరుగుతుంటే నీళ్ల విషయంలో సోయి లేని ప్రభుత్వం, నదీ జలాల పంపిణీ పై అవగాహన లేని ముఖ్యమంత్రి నిమ్మకు నీరెత్తినట్లు చూస్తూ ఉండిపోయారని అన్నారు. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ సైతం ఈ అంశంలో గప్ చుప్ అయ్యిందని మండిపడ్డారు. ఏపీ కుట్రలను పది రోజుల క్రితమే గమనించి తమ పార్టీ అధినేత కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని ముందుగా హెచ్చరించారని నవీన్ చెప్పారు. ఆ తర్వాత సోయిలోకి వచ్చిన బీఆర్ఎస్ తామే ప్రభుత్వాన్ని ప్రశ్నించినట్లు క్రెడిట్ చోరీకి ప్రయత్నిస్తుందని మండిపడ్డారు. గతంలో అధికారంలో ఉండి కృష్ణా నీళ్లను ఏపీ ప్రభుత్వం దోచుకెళ్తుంటే కిక్కురుమనని బీఆర్ఎస్ ను ప్రజలు నమ్మరని చెప్పారు. తెలంగాణ నీటి హక్కుల విషయంలో ఎంతదూరమైన కొట్లాడుతామని, క్రెడిట్ చోరీ ప్రయత్నాలు చేయకుండా నిజంగా తెలంగాణ కోసం పోరాటం చేస్తామని నవీన్ చెప్పారు.

## తెలంగాణ నీటి హక్కులపై ఏపీ కుట్రలు

నీటి హక్కుల విషయంలో తెలంగాణకు అన్యాయం చేసేందుకు ఏపీ ప్రభుత్వం మళ్లీ పావులు కదుపుతోందని నవీన్ మండిపడ్డారు. గతంలో తెలంగాణకు చేసిన అన్యాయం చాలదన్నట్లుగా మళ్లీ అవే కుట్రలు చేస్తున్నారని వివరాలతో సహా బయటపెట్టారు. గతంలో కృష్ణా నీళ్లలో పెద్ద ఎత్తున అన్యాయం చేస్తే ఇప్పుడు గోదావరి నీళ్లపై కన్నేశారన్నారు. గోదావరి నదిలో 273 టీఎంసీల నీళ్లపై అక్రమంగా హక్కులు పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని నవీన్ చెప్పారు. ఇందుకోసం ఈ నెల 18 న జరగనున్న గోదావరి రివర్ మేనేజ్ మెంట్ బోర్డు (జీఆర్ఎంబీ) మీటింగ్ వేదికగా చేసుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. కేంద్రంలో ఉన్న పలుకుబడిని ఉపయోగించి తెలంగాణ నీటి హక్కులను లాక్కునేందుకు కుట్రలు చేస్తున్నారని అన్నారు. పైగా గతంలో ఎప్పుడో తెలంగాణ ప్రాజెక్ట్ లు ఏడింటికి ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని కేంద్రానికి ఏపీ ప్రభుత్వం లేఖలు రాసిందని ఆయన చెప్పారు. తుమ్మిడి హెట్టి, కాళేశ్వరం, చిన్న కాళేశ్వరం, చౌట్ పల్లి హన్మంత రెడ్డి ప్రాజెక్ట్, చనాకా కొరాట బ్యారేజ్, మోడికుంట వాగు, కడెం - గూడెం లిఫ్ట్, సీతమ్మ సాగర్ - సీతారామ ఎత్తిపోతలకు ఇచ్చిన అనుమతులపై రివ్యూ చేయాలని, సమ్మక్క సాగర్ బ్యారేజీకి అనుమతులు ఇవ్వొద్దంటూ లేఖలో పేర్కొన్నదని తెలిపారు. వీటిలో చాలా ప్రాజెక్ట్ లు దాదాపు పూర్తయ్యాయని వాటికి ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలంటూ లేఖలు రాసే అధికారం ఏపీకి ఎక్కడిదని ప్రశ్నించారు. పోలవరం, ధవళేశ్వరం ప్రాజెక్ట్ లకు అనుమతులు రద్దు చేయాలని కోరితే ఏపీ ప్రభుత్వం అంగీకరిస్తుందా అని నిలదీశారు. ఏపీ చెప్పిన అభ్యంతరాలను జీఆర్ఎంబీ తన ఎజెండాలో పెట్టటం అన్యాయమని నవీన్ అన్నారు. ఏపీకి హక్కుగా వచ్చే 480 టీఎంసీ లు వాళ్లు వాడుకుంటే తమకు అభ్యంతరం లేదని కానీ తెలంగాణ నీటి హక్కులపై పెత్తనం చెలాయించాలని చూస్తే ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు.

## ముఖ్యమంత్రి స్పందించకపోవటం దుర్మార్గం

నీళ్ల సోయి లేని కాంగ్రెస్ ప్రభుత్వం, నదీ జలాల పంపిణీ పై అవగాహన లేని ముఖ్యమంత్రిగా కారణంగా తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సముద్రంలో కలిసే నీళ్లను ఏపీ వాడుకుంటే నష్టమేమిటని ముఖ్యమంత్రి మాట్లాడటం ఆయన అవగాహన రాహిత్యానికి నిదర్శనమన్నారు. కృష్ణా, పెన్నా బేసిన్ లోని ప్రాజెక్ట్ లకు 250 టీఎంసీలు తరలించేలా ఏపీ ప్రభుత్వం గోదావరి -- బనకచర్ల లింక్ చేపడుతుందని, దానికి తెలంగాణ సీఎం వంత పాడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణలోని చిన్న ప్రాజెక్టులపై ఏపీ విషం చిమ్ముతుంటే.. మన ప్రభుత్వం ఏపీ అక్రమ ప్రాజెక్టుల విషయంలో ఉదారంగా వ్యవహరించడం మన హక్కులను కాలరాయడమేనన్నారు. ఇన్నాళ్లు గోదావరి నీళ్లను ఎత్తిపోసే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రభుత్వం ఇప్పుడిప్పుడే మేల్కొని నీళ్లను ఎత్తిపోస్తామని చెబుతోందన్నారు. కానీ ఏపీ చేస్తున్న కుట్రల కారణంగా గోదావరి నదిలో కూడా తెలంగాణకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన అన్యాయమే మళ్లీ ఇప్పుడు జరుగుతుందని హెచ్చరించారు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం మేల్కొని ఏపీ కుట్రలను అడ్డుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అసలు ఏపీ మాటలు విని తుమ్మిడిహెట్టి పై జీఆర్ఎంబీ ఏ విధంగా అభ్యంతరం చెబుతుందని ప్రశ్నించారు. ఏపీ చేస్తున్న అన్యాయన్ని ముందుగా గుర్తించి ప్రభుత్వాన్ని హెచ్చరించింది టీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల కవితేనని గుర్తు చేశారు. తాము హెచ్చరించిన తర్వాతే ప్రభుత్వంలో కదలిక వచ్చి రివ్యూ మీటింగ్ లు నిర్వహించటం మొదలు పెట్టారన్నారు. ఎట్టి పరిస్థితుల్లో అన్యాయం జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

## క్రెడిట్ చోరీకి బీఆర్ఎస్ యత్నం

తెలంగాణకు ఏపీ ఇంత అన్యాయం చేస్తుంటే ప్రధాన ప్రతిపక్షంగా పోరాటం చేయాల్సిన బీఆర్ఎస్ గప్ చుప్ గా ఉందని నవీన్ అన్నారు. పది రోజుల క్రితమే టీఆర్ఎస్ ఈ అంశాన్ని వెలుగులోకి తేవడంతో మేల్కొన్న బీఆర్ఎస్ నాయకులు అప్పుడు ఈ అంశంపై మాట్లాడటం స్టార్ట్ చేశారన్నారు. పైగా తమ కారణంగానే ప్రభుత్వంలో కదలిక వచ్చిందంటూ క్రెడిట్ చోరీకి ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత కూడా కృష్ణా నీటిలో అన్యాయం జరగటానికి బీఆర్ఎస్ కారణం కాదా అని నవీన్ ప్రశ్నించారు. రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్ట్ పేరుతో పెద్ద ఎత్తున ఏపీ మన నీటిని దోపిడీ చేస్తుంటే ఏడాది పాటు కిక్కురుమనకుండా కూర్చుంది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆయన చెప్పారు. ఏపీ నీటి దోపిడీకి కాంగ్రెస్ తో పాటు బీఆర్ఎస్ కూడా వత్తాసు పలుకుతుందన్నారు. బీఆర్ఎస్ క్రెడిట్ చోరీ ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని ఎన్ని డ్రామాలు చేసిన మీ నిజ స్వరూపం ప్రజలకు తెలుసని అన్నారు.

## కేంద్రానికి జల విధానం లేదా?

ఏపీ తానా అంటే కేంద్రం తందానా అంటుందని నవీన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ ప్రభుత్వం తుమ్మిడిహెట్టి గురించి అభ్యంతరం చెబితే జీఆర్ఎంబీ తన అజెండాలో ఆ అంశాన్ని ఎలా పెడుతుందని ఆయన ప్రశ్నించారు. గోదావరి నది జలాల్లో తెలంగాణ వాటా తేల్చేందుకు ఇంకా ఎన్ని సంవత్సరాలు చేస్తారని నిలదీశారు. ఓ వైపు తుపాకుల గూడెం వద్ద నుంచి గోదావరి, కృష్ణా రివర్ లింక్ చేపట్టాలని అంటూనే మళ్లీ ఏపీ చెప్పిన అభ్యంతరాలపై సమాధానం చెప్పాలని ఎలా అడుగుతారని ఆయన ప్రశ్నించారు. అసలు కేంద్రానికంటూ ఒక జలవిధానం లేదా అని నవీన్ అడిగారు. తెలంగాణ నీటి విషయంలో వచ్చే హక్కులను కేంద్రమే కాపాడాలని కోరారు.

## తెలంగాణకు అన్యాయం జరగనివ్వం

నీటి హక్కుల విషయంలో ఏపీ కుట్రలను ఎట్టి పరిస్థితుల్లో సాగనివ్వమని నవీన్ చెప్పారు. తెలంగాణ ప్రాజెక్ట్ లపై ఏపీ చెప్పిన అభ్యంతరాల మాదిరిగానే ఏపీ ప్రాజెక్ట్ లపై తాము అభ్యంతరం చెబుతామన్నారు. ఒక పార్టీగా అదే విధంగా పౌర సమాజం నుంచి కూడా లక్షలాదిగా కేంద్ర జలశక్తి శాఖకు లేఖలు రాస్తామన్నారు. నీటి హక్కుల విషయంలో క్రెడిట్ చోరీ పై దృష్టి పెట్టకుండా తెలంగాణ ప్రయోజనాల కోసం పనిచేస్తామన్నారు.

---

## సెకండ్ ఇన్నింగ్స్‌లోనూ జెట్ స్పీడ్..

# రవీనా టాండన్ దూకుడు!



ఒకప్పుడు గ్లామరస్ రోల్స్‌తో కుర్రకారును మెస్మరైజ్ చేసిన రవీనా టాండన్.. ఇప్పుడు కంటెంట్ డ్రివెన్ పాత్రలతో తన సెకండ్ ఇన్నింగ్స్‌లో దూసుకెళ్తున్నారు. 'పట్నా శుక్లా', 'కర్మ కాలింగ్', 'గుడ్‌చడి' వంటి చిత్రాలు, సిరీస్‌లతో నటిగా మరోసారి సత్తా చాటిన ఆమె.. ప్రస్తుతం వరుస క్రేజీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు.దఅక్షయ్ కుమార్ హీరోగా తెరకెక్కుతున్న 'వెల్‌కమ్ టు ది జంగిల్'తో పాటు సూర్య నటిస్తున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్' లోనూ రవీనా కీలక పాత్రలు పోషిస్తున్నారు. అలాగే 'లాయర్', 'మాలామాల్ వీక్లీ' సీక్వెల్ వంటి ప్రాజెక్టులు కూడా ఆమె చేతిలో ఉన్నాయి. ఇలా కమర్షియల్ సినిమాలతో పాటు ఓటీటీ కంటెంట్‌ను బ్యాలెన్స్ చేస్తూ.. కూతురు రాషా తడానీ కంటే ఫాస్ట్‌గా సినిమాలు చేస్తూ సెకండ్ ఇన్నింగ్స్‌లోనూ తనదైన మార్క్ చూపిస్తున్నారు ఈ మాజీ గ్లామర్ క్వీన్.



## మహాదేవిగా కామాక్షి భాస్కర్ల..

లేడీ ఓరియెంటెడ్ సినిమాలకు ప్రేక్షకాదరణ పెరుగుతున్న వేళ.. మరో విభిన్నమైన కథతో కామాక్షి భాస్కర్ల ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. 'పొలిమేర' చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న ఆమె.. దర్శకుడు ఎం.ఎస్. రాజు తెరకెక్కించిన 'అగధ'లో 'మహాదేవి' అనే శక్తివంతమైన పాత్రలో నటించారు. ఈ సినిమా ఆగస్టు 14న విడుదల కానుంది.

ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్ సినిమాపై ఆసక్తిని పెంచాయి. ఇప్పటివరకు చేసిన పాత్రలకు పూర్తి భిన్నంగా కామాక్షి కనిపించనుండటంతో పాటు.. సినిమాలోని కీలక యాక్షన్ సన్నివేశాల్లోనూ ఆమె స్వయంగా నటించినట్లు తెలుస్తోంది. మహిళా ప్రధాన కథాంశంతో తెరకెక్కిన 'అగధ'.. కామాక్షి కెరీర్‌లో ఎలాంటి మైలురాయిగా నిలుస్తుందో చూడాలి.

## ఆసుపత్రి నుంచి ఎన్టీఆర్ డిశ్చార్జ్..

జూనియర్ ఎన్టీఆర్ కిమ్స్ ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఇటీవల జిమ్‌లో కసరత్తులు చేస్తుండగా కుడి భుజానికి గాయం కావడంతో.. వైద్యుల సూచన మేరకు ఆయన ఆసుపత్రిలో చేరారు. వైద్యులు ఆర్థ్రోస్కోపిక్ సర్జరీ చేయగా, అది విజయవంతంగా పూర్తైంది. ప్రస్తుతం ఎన్టీఆర్ ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.




సర్జరీ అనంతరం వైద్యులతో కలిసి ఎన్టీఆర్ దిగిన ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పూర్తిగా కోలుకునేందుకు రెండు నుంచి మూడు నెలల సమయం పట్టొచ్చని, ఈ సమయంలో ఫిజియోథెరపీ అవసరమని వైద్యులు సూచించారు. తన ఆరోగ్యం కోసం ప్రార్థించిన అభిమానులు, శ్రేయోభిలాషులకు ఎన్టీఆర్ ధన్యవాదాలు తెలిపారు.